తునిలో టీడీపీ అరాచకం

- చిన్నబోయిన ప్రజాస్వామ్యం
- రెడ్ బుక్ పాలనకు నిదర్శనమన్న సీపీ సుధారాణి
- రెండో రోజూ పోలీసులు మౌన వ్రతం
- కౌన్సిల్ హాలులో యథేచ్ఛగా నాయకుల గలాటా
- కౌన్సిల్ హాలు ముందు కూర్చున్న కౌన్సిలర్లు
- స్పందించని అధికారులు, పోలీసులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సుధారాణి, కౌన్సిలర్లు

తుని: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తునికి ప్రత్యేక ఉంది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఎన్నికల ప్రచారం నుంచి ప్రభుత్వ పథకాల వరకు తూర్పు సెంటిమెంట్‌తో తుని నుంచి శ్రీకారం చుట్టేవారు. ఇది టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు పాటించాయి. ఇంతటి ప్రత్యేక ఉన్న తునిలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారులు చేసిన తప్పిదం మాయని మచ్చను తెచ్చింది. ప్రజలు తీర్పును ఎవరైనా గౌరవిస్తారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం అంతగా పట్టించుకోరు. ఇదే విషయాన్ని టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో నిరూపించుకున్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికను రెండు రోజుల పాటు డ్రామా నడిపి వాయిదా వేయించారు. దీని వల్ల వైఎస్సార్ సీపీకి వచ్చిన నష్టం ఏమిలేదు. టీడీపీకి ఒక్క సీటు లేని కౌన్సిల్‌లో జరిగే ఎన్నికను ఎందుకు అడ్డుకున్నారో ఎవరికి అర్థం కావడం లేదు. రాజకీయ విశ్లేషకులు మాత్రం టీడీపీ సెల్ఫ్ గోల్ కొట్టుకుందని చెబుతున్నారు.

తీరుమారని అధికారులు

తొలిరోజు జరిగిన సంఘటను దృష్టిలో పెట్టుకుని ఎన్నికను జరిపిస్తారని అందరూ భావించారు. ఇందుకు భిన్నంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వినూత్న పరిణామం చోటు చేసుకుంది. ఉదయం 11 గంటలకు వైఎస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ప్రీసీడింగ్ అధికారి వేణుగోపాలరావు కౌన్సిలర్లకు నోటీసులు ఇచ్చారు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో పాటు 23 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ప్రధాన ద్వారానికి చేరుకున్నారు. అప్పటికే టీడీపీకి చెందిన శ్రేణులు గేటు ముందు నుంచి పోలీసులు లోపలికి పంపించారు. కౌన్సిలర్లను మాత్రం గేటు ముందు నిలిపి వేశారు. కౌన్సిలర్లు కౌన్సిల్ హాలుకు చేరగా అప్పటికే కౌన్సిల్ హాలులో టీడీపీకి



టీడీపీ నాయకులను బయటకు పంపాలని సీఐ చెన్నకేశవరావును కోరుతున్న కౌన్సిలర్లు

చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, కౌన్సిలర్లు లోపల ఉన్న వ్యక్తులను బయటకు పంపిస్తే మేం లోపలకు వస్తామని పోలీసులకు చెప్పారు. పోలీసులు మాత్రం పట్టించుకోలేదు. దీంతో కౌన్సిలర్లు కౌన్సిల్ హాలు ముందు నేలపై కూర్చున్నారు. 12 గంటల సమయం వరకు పోలీసులు, అధికారులు పట్టించుకోలేదు. అధికారం ఉంటే అనుమతి లేకపోయిన చట్ట సభలకు అనుమతిస్తారని కౌన్సిలర్లు అవాక్కయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంత రచ్చ జరుగుతున్నా కమిషనర్ వెంకట్రావు, ఎన్నికల అధికారి వేణుగోపాలరావు పత్తా లేకుండాపోయారు. ప్రజలు కట్టిన పన్నులను జీతంగా తీసుకుంటున్న అధికారులు ప్రజా స్వామ్యానికి వ్యతిరేకంగా పని చేయడం ఎంత వరకు సమంజమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

న్యాయ పోరాటం చేస్తాం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల హక్కులను హరించిన అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వేశాక సీపీ సుధారాణి, కౌన్సిలర్లు మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళలను చట్ట సభల్లో అగ్రగామిక స్థానం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగ సభల్లో చెబుతున్నారని, తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో ఎందుకు అవమానించారో చెప్పాలని సుధారాణి డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేసిన మున్సిపల్ అధికారులు, పోలీసుల తీరుపై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఉదాసీనంగా వ్యవహరించిన ఎవ్వరిని వదిలే ప్రసక్తి లేదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా వల్ల వైఎస్సార్ సీపీకి నష్టం లేదని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నాయకత్వంలో పార్టీ కోసం పని చేస్తామన్నారు. కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి

ఏలేశ్వరం: రమణయ్యపేట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని మంగళవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి పరిశీలించారు. గత కొంత కాలంగా రహదారి అధ్వానంగా ఉండడంతో ఇటీవల రహదార నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. రమణయ్యపేట గ్రామంలో శ్మశాన వాటిక కావాలని కలెక్టర్‌ని గ్రామస్తులు కోరారు. ఆయన స్థలం పరిశీలించాలని డిప్యూటీ తహసీల్దార్ కుశరాను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలతో ప్రయాణం సురక్షితం

రౌతులపూడి: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి సురక్షితమైన ప్రయాణాలను సాగించాలని రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆటోడ్రైవర్లతో కలసి పోలీసులు భద్రతా నియమాలపై ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి సినిమా రోడ్డు మీదగా ప్రధాన రహదారిలో ప్రజలకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆటోడైవర్లతో ఆయన సమావేశమై సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లిలో ప్రభుత్వాస్పత్రి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బంది క్యాన్సర్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డా.సునీల్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యకరమైన జీవనశైలి అవలంబించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. క్యాన్సర్ నుంచి దూరంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తల్లులు బిడ్డలకు ఎక్కువ కాలం తల్లిపాలు ఇవ్వాలని, ధూమపానానికి, గుట్కా, తంబాకు వంటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌కు వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఎస్.శంకర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రజలు క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్యమైఖేల్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

శంఖవరం: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేసవి వస్తున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పించాలన్నారు. డ్రైనేజీల్లో పూడిక తీత, గ్రామాల్లో వీధి దీపాలు వెలిగించాలన్నారు. ఉపాధి హామీ ద్వారా చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ, వైస్ ఎంపీపీలు ఈగల చిన్నమ్ములు, ధారా వెంకట రమణ, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో చోరీ

శంఖవరం: కత్తిపూడిలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. అన్నవరం ఎస్సై హరిబాబు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విరవల్లి కామేశ్వరరావు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. సుమారు 3 తులాల బంగారం, రూ.50 వేలు నగదు అపహరించినట్టు తెలిపారు.

ఘనంగా యోగా పోటీలు

తొండంగి: పెరుమాళ్లపురం జెడ్పీహైస్కూలులో రథసప్తమీ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు యోగాపోటీలు నిర్వహించారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీఈటీ శివాజీ విద్యార్థులతో కలిసి సూర్యనమస్కారాలు, పలు రకాల ఆసనాలు వేశారు. యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్ టైర్ పేలి ప్రయాణికుల ఇబ్బంది

గండేపల్లి: రాజమహేంద్రపురం నుంచి తుని వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు టైరు గండేపల్లి వద్ద పేలిపోయింది. దీనితో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. బస్సు టైర్ మార్చే వరకూ ఎండలో నిలుచున్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



తునిలో నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

తుని: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను స్వాగతించడం జీవిత బీమా సంస్థకు నష్టమని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం తుని శాఖ అధ్యక్షుడు ఎం.సాయిబాబా అన్నారు. మంగళవారం తుని ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగులు విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఆర్థిక పరిపుష్టి కలిగిన ఎల్ఐసీని విదేశీ సంస్థలకు అప్పగించడం సరికాదని సాయిబాబా అన్నారు. యూనియన్ కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ, పలువురు ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మినీ జెట్టీల నిర్మాణానికి స్థల పరిశీలన

తొండంగి: మత్స్యకారులకు సౌకర్యాల కల్పనలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జెట్టీల నిర్మాణానికి మండలంలోని దానవాయిపేట, కొత్తపోడిపల్లిపేట గ్రామాల్లో మత్స్యశాఖ అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. జిల్లా మత్స్యశాఖాధికారి కరుణాకర్‌రావు, రెవెన్యూ అధికారులతో కూడిన బృందం దానవాయిపేటలో ఆరెకరాలు, కొత్తపోడిపల్లిపేటలో ఆరెకరాల స్థలాన్ని గుర్తించింది. మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు. ఎఫ్‌డీఓ ఉమామహేశ్వరరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు

- సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాలరావు

తుని రూరల్: పది, ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఏకాగ్రతతో వార్షిక పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. కేజీబీవీ రికార్డులు పరిశీలించిన ఆయన పది, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో సమావేశమయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థినులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మంచి ఆరోగ్యంతో ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఇందుకు యోగాతో ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. మార్చిలో జరగనున్న పరీక్షలకు విద్యార్థినులు సన్నద్ధంగా ఉండాలని, పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ అమృతవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వి.కొత్తూరు కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ వేణుగోపాలరావు

పశువుల సంత పేరుతో టీడీపీ దోపిడీ

- రూ.14 లక్షల పంచాయతీ నిధులకు గండి
- మాజీ మంత్రి తోట నరసింహం ఆగ్రహం

జగ్గంపేట: జగ్గంపేటలో టీడీపీ నేతల అరాచకాలు, దోపిడీలు మితిమీరుతున్నాయని, పశువుల సంత పేరుతో లక్షలాది రూపాయలను మింగేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందే జగ్గంపేటలో పంచాయతీ పశువుల సంతను రూ.14 లక్షలకు వైఎస్సార్ సీపీకి చెందిన కాపారపు ప్రసాద్ అనే నాయకుడు వేలం పాటను దక్కించుకుని నిర్వహిస్తుంటే జగ్గంపేటకు చెందిన కొంత మంది టీడీపీ నేతలు అధికారంలోకి రాగానే బెదిరించి అతనిని తరిమేసి, తెలివిగా పంచాయతీకి సొమ్ము కట్టకుండా ఎత్తులు వేశారని తెలిపారు. అప్పటివరకూ పోలవరం కాలవగట్టు మీద జరుగుతున్న పశువుల సంతను ఆ అధికారులతో పంచాయతీకి నోటీసులు ఇప్పించి సంత లేకుండా చేశారని, దీంతో పంచాయతీ పాలకవర్గం పశువుల సంత నిర్వహణకు స్థలం లేదు కాబట్టి జగ్గంపేట పంచాయతీలో పశువుల సంతను రద్దు చేస్తూ తీర్మానం చేసిందని అన్నారు. దీనివల్ల పంచాయతీకి పశువుల సంత ద్వారా వచ్చే రూ.14 లక్షల ఆదాయానికి గండి పడిందని తెలిపారు. ఇదంతా పక్కా ప్లాన్‌తో టీడీపీ నేతలు చేశారని, ఇప్పుడు అదే ప్రదేశంలో అనధికారికంగా పశువుల సంతను నడుపుతూ లక్షల రూపాయలను దోచుకుంటున్నారని మండి పడ్డారు. అయితే అన్ని చోట్ల నుంచి విమర్శలు రావడంతో ప్రస్తుతం మొక్కుబడిగా పశువుల సంతను రూ.2లక్షలకు పాడినట్లు, వేరే ప్రాంతంలో నిర్వహిస్తున్నట్టు ప్రకటించారని అన్నారు. ఇదే తరహాలో మట్టి, ఇసుక మాఫియా జరుగుతోందని, రామవరంలో సుద్ద మట్టి మాయమవుతోందని దీనిలో టీడీపీ నేతల పాత్ర ఉందని వీటికి సంబంధించి ఫొటోలు, వీడియోలు ఉన్నాయని సమయం వచ్చినప్పుడు బయటపెడతామని హెచ్చరించారు. అధికారులు తమ విధినిర్వహణలో ఒక పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాలని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పెద్దాడ రాజబాబు, రావుల గణేష్ రాజా, కాపారపు ప్రసాద్, భూమాడ గణపతి, జగాల్, గ్రామానికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న తోట నరసింహం

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

తుని రూరల్: వేసవిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీల సంఖ్య వందల నుంచి వేల సంఖ్యకు పెంచాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అడపా వెంకటలక్ష్మి అన్నారు. తుని మండలం రాజుపేట, లోవకొత్తూరు గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. గ్రామంలో నిర్మించిన గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ గోకులం షెడ్లు ప్రయోజనకరంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యాతా ప్రమాణాలు పాటించాలని ఏపీఓ పసుపులేటి నారాయణరావు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఆంజనేయులను ఆదేశించారు. అదేవిధంగా రోజు కూలీల హాజరును అడిగి తెలుసుకున్నారు. వందల్లో ఉన్న కూలీల సంఖ్యను రెండో వారానికి ఘననీయంగా పెంచాలని, కనిష్టంగా రోజు కూలీల సంఖ్య ఐదు వేలకు పెంచాలని ఆదేశించారు. ఇందుకు టీఏలు, ఎఫ్‌ఏలు, మేట్‌లతో పాటు ఏపీఓలు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి నిధులతో గ్రామాల్లో గోకులం షెడ్లు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఎంపీడీఓ కె.సాయి నవీన్ పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల మంజూరు లక్ష్యాన్ని సాధించాలి



డ్వాక్రా మహిళలతో సమీక్షిస్తున్న అధికారులు

తొండంగి: డ్వాక్రా మహిళా సంఘాలకు శ్రీనిధి రుణాలను మంజూరు లక్ష్యాన్ని సాధించాలని శ్రీనిధి ఏజీఎం బి.సునీత అన్నారు. మంగళవారం మండలంలోని స్త్రీశక్తి భవన్‌లో డ్వాక్రా వీవోలు, ఇతర అధికారులతో సమీక్షించారు. సునీత మాట్లాడుతూ గడచిన రెండేళ్లలో 6 వేల మంది సభ్యులకు రూ.14 కోట్లు శ్రీనిధి రుణాలు ఇచ్చినట్టు వివరించారు. మరో ఎనిమిది కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చిట్టిబాబు, వై.సుశీసౌభాగ్యవతి, ఎస్.శ్రీనుబాబు, కె.నాగేంద్రబాబు, ఏపీఎం వై.సత్తిబాబు ఉన్నారు.

కానరాని ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి

- కళ్లెదుటే నాయకుల ఫ్లెక్సీలున్నా పట్టించుకోని అధికారులు

తుని రూరల్: శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకుల ఫ్లెక్సీలు యథాతదంగా ఉన్నాయి. బహిరంగ ప్రదేశాల్లోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లోను ఫ్లెక్సీలు ఉండడం గమనర్హం. తుని నియోజకవర్గంలో కోడ్ ఆఫ్ కాండెక్ట్ అమలు చేయాల్సిన అధికారులు తమకు పట్టనట్టు వ్యహరిస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల్లోనూ, తుని పట్టణంలోనూ కూటమి నాయకుల ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. 2024 క్రిస్మస్, 2025 జనవరి ఒకటి, సంక్రాంతి పర్వదినాల శుభాకాంక్షలు తెలియజేస్తూ వివిధ పార్టీ కార్యకర్తలు తమ నాయకులు ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కొన్ని జిల్లాలతో పాటు కాకినాడ జిల్లాలోను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చింది. ఉన్నత అధికారుల ఆదేశాలతో కొంతమంది పంచాయతీ కార్యదర్శులు ఫ్లెక్సీలు తొలగించారు. అయినప్పటికీ తుని పట్టణం, తుని మండలం, కోటనందూరు, తొండంగి మండలాల్లో అధిక సంఖ్య గ్రామాల్లో ఫ్లెక్సీలు నేటికి ఉన్నాయి. దీనిపై ఎంపీడీఓ కె.సాయి నవీన్‌ను వివరణ కోరగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఫ్లెక్సీలు తీసివేయాలని కోరామన్నారు. ఇంకా కొన్ని గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను బుధవారం నుంచి తమ సిబ్బందితో తొలగిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.



తుని రాజా గ్రౌండ్‌వద్ద తొలగించని ఫ్లెక్సీలు

ప్రకృతి సేద్యాన్ని పరిశీలించిన శ్రీలంక ప్రతినిధుల బృందం

ప్రత్తిపాడు: మండలంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించేందుకు మంగళవారం సాయంత్రం శ్రీలంక ప్రతినిధుల బృందం ప్రత్తిపాడు విచ్చేసింది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన సర్వోదయ శ్రమదాన ఉద్యమ సుస్థిర అభివృద్ధి విభాగం (ప్రోగ్రాం అసిస్టెంట్–సర్వోదయ, సస్టైనబుల్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ యూనిట్) బృందం సభ్యులు రత్నాయకడే రత్నసిరి, ప్రియదర్శిని సికురాజపతి, హర్షల సంత, తిలక్ చందన, అనోమా సంజీవని, హెడిరిమన్నా బృందానికి ఏపీఎం వై.వెంకట్ స్వాగతం పలికారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలు ప్రకృతి వ్యవసాయంలో ఏవిధంగా తోడ్పడుతున్నాయో ఏపీఎం వెంకట్ శ్రీలంక బృందానికి వివరించారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ విధానంలో అనుసరిస్తున్న తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్, కో ఆర్డినేటర్ గణేష్, రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కార్యాలయ సిబ్బంది ప్రీతి, సరోజ, ప్రత్తిపాడు మండల టీమ్ లీడర్ నికేష్ వర్మ, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో శ్రీలంక బృందానికి స్వాగతం పలుకుతున్న ఏపీఎం వెంకట్ తదితరులు

ఆదర్శలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

గోకవరం: ఆదర్శ ఫార్మశీ కళాశాలలో ఫార్మసిస్టుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రధానమంత్రి కౌసల్య యోజన కార్యక్రమంలో భాగంగా లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్‌వారి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ ప్రారంభించారు. కళాశాల చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాథరావు మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు.


డ్రోన్ స్ప్రేయర్లతో మెరుగైన ఫలితాలు



కొత్తకొట్టాంలో అపరాల సాగులో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చంద్రశేఖర్

కోటనందూరు: సాగులో డ్రోన్ స్ప్రేయర్లను వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. కొత్తకొట్టాంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయర్ల ద్వారా తక్కువ ఖర్చుతో ఎరువులు, పురుగుమందులను పిచికారీ చేసుకోవచ్చన్నారు. డ్రోన్ స్ప్రేయర్ల వినియోగంతో కూలీల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. డ్రోన్ స్ప్రేయర్లతో మంచి మార్పులు వచ్చే అవకాశం ఉన్నందునే ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వం ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా డ్రోన్ ఆపరేటింగ్ పైలట్ శిక్షణ ఇస్తుందన్నారు. డ్రోన్ స్ప్రేయర్ కావాలనుకునే రైతులు గ్రూప్‌గా ఏర్పడి రాయితీపై కొనుగోలు చేసుకోవచ్చన్నారు. అనంతరం రైతులతో కలిసి అపరాల పంటను పరిశీలించి ఎల్లో మొజయిక్, తెల్లదోమ తెగుళ్లు ఆశిస్తున్నట్టు గుర్తించారు. తెగుళ్ల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కేవీ శివకుమారి, నల్లమిల్లి సురేష్, వీఆర్వో సుభద్రాదేవి, వీఏఏ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి పూజలు



సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు



తంటికొండ దేవస్థానంపై పూజలు నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: రథసప్తమి పూజలు వేడుకగా జరిగాయి. మంగళవారం రథసప్తమి పర్వదినాన్ని పురష్కరించుకుని ఎస్.అన్నవరం, ఎన్.సూరవరం, డి.పోలవరం, టి.తిమ్మాపురం, హంసవరం, వి.కొత్తూరు, హెచ్.కొత్తూరు, తదితర గ్రామాల దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలోగల శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూర్యభగవానుడి విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేసి పిడకలపై పరమన్నం వండి నైవేద్యం పెట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సూర్యభగవానుడిన దర్శించి, సూర్య నమస్కారాలు చేశారు.

తంటికొండ వెంకన్నకు పూజలు

గోకవరం: తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, చతుర్దశ కళశారాధాన, పంచామృత మండపారాధన, కుంభపూజ, మూర్తి ఆవాహన పూజలు నిర్వహించారు. అనంతరం రథసప్తమిని పురస్కరించుకుని గ్రామంలో ప్రజల నుంచి పాలకావిడి ద్వారా పాలు సేకరించి ఆలయ ప్రాంగణంలో సామూహిక పాలు పొంగించే కార్యక్రమం నిర్వహించారు. నైవేద్యం సిద్ధం చేసి సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేసి, సమర్పించారు. అనంతరం దేవస్థానం మాజీ చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, తులసీ దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. పూజల్లో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొన్నారు. వేలాది సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు బుధవారం ఉదయం క్షేత్రపాలకుడు అభయాంజనేయస్వామికి హోమాలు, పూజలు నిర్వహించనున్నారు.

స్థానిక సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో స్కంద బాలాజీ సూర్యదేవాలయ ప్రాంగణంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానంలో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు: రథసప్తమీని పురస్కరించుకొని మండలంలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు.



ఎస్.అన్నవరంలో సూర్యభగవానుడి నైవేద్యానికి పిడకలపై పరమాన్నం వండుతున్న అర్చకులు

ఏలేశ్వరం: రథసప్తమి వేడుకలు మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దనాపల్లి గ్రామంలో సూర్యనారాయణ మూర్తి స్వామి వారి ఆలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఏలేశ్వరంలోని షిర్డీ నగర్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు.

రత్నగిరిపై రథసప్తమి వేడుకలు

- స్వామివారికి ప్రత్యేక పూజలు
- సూర్య నమస్కారాలు సమర్పించిన పండితులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని వార్షిక కల్యాణ వేదికపై సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమలలో సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలు జరిగాయి. సూర్యనమస్కారాలు, వివిధ ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ ఘనపాఠి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కార్యక్రమాల సలహాదారు నాగాభట్ల కామేశ్వరశర్మ, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల సాయిరామ్, దత్తాత్రేయ శర్మ, రుత్విక్కులు నిర్వహించారు. సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించిన రాపాక రాందాసు, చిట్టెం సాయి, కొక్కిరిగడ్డ ప్రవీణ్, జోస్యుల శేషులకు దీక్షావస్త్రాలను ఈఓ బహూకరించారు.



రత్నగిరిపై సూర్యనమస్కారాలు నిర్వహిస్తున్న పండితులు

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MF 245 PD 2022 MODEL
AP39 NH 2600
Cell : 95021 92320
Door No: 9-1-67/1, Koneti Street, Railway Station Road, ANAKAPALLE.